

మరమ్మతు చేపట్టరూ

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక చౌరస్తా నుంచి విలాసాగర్ వెళ్లే రహదారిలో కమాన్ టర్నింగ్ వద్ద రోడ్డు కట్ కావడంతో పాటు కయ్యలు పడి అధ్వానంగా తయారైంది. నిత్యం ఈ రహదారి గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది. గతంలో వర్షపునీరు నిలిచి పలుసార్లు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. రాత్రిపూట వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు మరమ్మతు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ధాన్యం రాశులు పోయి.. రాళ్లు మిగిలాయి

చందుర్తి : మండలంలోని బండపల్లి గ్రామంలో తెలంగాణ క్రీడా మైదానంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టార్పాలిన్ కవర్లు వేసి రైతులు ధాన్యం పోశారు. టార్పాలిన్ కవర్లు గాలి తాకిడికి పైకి లేచిపోకుండా రాళ్లను టార్పాలిన్లపై వేశారు. ఇటీవల ధాన్యం కొనుగోలు ముగియగానే తీసుకువచ్చి బండరాళ్లను క్రీడా మైదానంలో వేశారు. దీంతో క్రీడామైదానం మొత్తం రాళ్లతో నిండిపోయింది. కాగా ధాన్యపు రాశులు పోయి రాళ్లు మాత్రమే మైదానంలో మిగిలిపోయాయని పలువురు చర్చించుకుంటున్నారు.



అసంపూర్తిగా భవన నిర్మాణం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.8లక్షలు మంజూరు చేసింది. కాగా కాంట్రాక్టర్ స్లాబ్ లెవల్ వరకు పనులు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో అద్దె భవనంలో ఇరుకుగదుల్లో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

‘వెలిచాల’కు సన్మానం



రాజేందర్‌రావును సన్మానిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ : కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మంగళవారం తన నివాసంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, నాయకులు సాగారం వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, అరుణ్‌తేజచారి, దాడి మల్లేశం, నాగుల విష్ణు, కనికరపు రాకేశ్, పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ సేవలో విప్

ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం బద్దిపోచమ్మకు కల్లుసాక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎల్‌వోసీ అందజేత

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లికి చెందిన తోట హరీశ్‌కు రూ. 5లక్షల ఎల్‌వోసీ మంజూరైందని డీసీసీ ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్ తెలిపారు. గ్రామానికి చెందిన హరీశ్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. అతనికి చికిత్స అందించేందుకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కోరగా రూ. 5 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

సిరిసిల్లటౌన్: పట్టణంలోనియ పాతపోచమ్మ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చేతుల మీదుగా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్, ఆలయ ట్రస్ట్ మాజీ చైర్మన్ సిరిగిరి మురళి, కూర శ్రీధర్, కోడం సంజీవ్, కోడం అశోక్, వెంకన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లికి చెందిన సాదల ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. మృతుడి భార్య మానసిక దివ్యాంగురాలు కాగా ముగ్గురు పిల్లలు ఉన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు మాచెట్టి లక్ష్మణ్ రూ.5వేలు, చిట్నేని మాధవి, వేంకటేశ్వర్‌రావు దంపతులు రూ.10వేలు, జూకంటి హన్మంత్‌రావు రూ.5వేలు గ్రామంలోని పలువురు రూ.40వేలు పోగు చేసి, మొత్తం రూ.60వేల నగదును మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ సర్పంచ్‌లు జ్యోతి, గాడిచెర్ల దేవయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాయమల్లు, నాయకులు బాపురెడ్డి, ఎల్లం, యువకులు ఉన్నారు.

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటలో ఉపాధిహామీ పనుల్లో మట్టిపెళ్లలు పడి ఇటీవల మారుపాక రాజవ్వ అనే మహిళ మృతిచెందింది. బాధిత కుటుంబానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తరఫున రూ.10వేల ఆర్థికసాయాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు మంగళవారం అందజేశారు. ఇక్కడ మండలశాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, చల్ల జితేందర్ రెడ్డి, నోముల భాస్కర్‌రెడ్డి, ఆకుల నాగరాజు, వెలిశాల రవి, బొల్లారం తిరుపతి, జిన్న అనిల్, వీరమల్లు, సందు రవిబాబు, నేరెళ్ల లింబయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కారు బీభత్సం

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తాడూర్ ఎక్స్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వెళ్తూ ముందు వెళ్తున్న ద్విచక్రవాహనం, డివైడర్‌కు ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కారు నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు. అతడు తాగి ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న కేటీఆర్

గంభీరావుపేట: ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండి, వర్షాలు సకాలంలో కురిసి పంటలు పండాలని రేణుకామాతను వేడుకున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే, కేటీఆర్ తెలిపారు. మండలకేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మ సిద్ధోగం వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు శుభాకాంక్షలు తెలిపా రు. అయన వెంట టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మండల, పట్టణశాఖ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, వెంకటియాదవ్, నాయకులు గంధ్యాడపు రాజు, దయాకర్‌రావు, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, లతారెడ్డి, పిట్ల శ్రీమతి, నాగరాజుగౌడ్, గౌడ సంఘం నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు

మండలకేంద్రంలో జరుగుతున్న ఎల్లమ్మ సిద్ధోగం వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు హమీద్ భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలి



నామాపూర్‌లో కుటుంబ సభ్యులతో రాజు

ముస్తాబాద్: మండలంలో నాలుగురోజుల క్రితం ఈదురుగాలులతో కూడగిన వర్షానికి యాభైకిపైగా ఇళ్లు దెబ్బతిన్నాయి. నామాపూర్, కొండాపూర్, ఆవునూర్, రామలక్ష్మణపల్లె, తుర్కపల్లి, ముస్తాబాద్, పోతుగల్ తదితర గ్రామాల్లో రేకుల ఇళ్లుగా పూర్తిగా దెబ్బతిన్నాయి. రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సర్వే చేపట్టారు. ఇళ్లు కోల్పోయి వీధిన పడ్డ వారిని ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కొండాపూర్‌లో నాగెల్లి రాజు, యశోద దంపతుల రేకుల షెడ్డు, నామాపూర్‌లో వాతపు రాజు ఇంటి రేకులు లేచిపోయాయని వారిని ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా దెబ్బతిన్న ఇళ్లను సర్వే చేపట్టామని, బాధితుల వివరాలు నమోదు చేసి అధికారులకు నివేదిక ఇచ్చామని తహసీల్దార్ సురేశ్ తెలిపారు.

‘బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం’

ఈదురుగాలులతో గూడు కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండలంలోని తుర్కపల్లి, రామలక్ష్మణపల్లె, గూడెం, నామాపూర్‌లో ఈదురుగాలులతో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. తుర్కపల్లిలో ఈదురుగాలులకు రేకులు లేచిపోయి గాయపడిన బాలికను ఆయన పరామర్శించారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, జవ్వాజి బాలకృష్ణ, చందు, దేవదాస్, రంజిత్, రాజు ఉన్నారు.

‘ఆదర్శ’ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

గంభీరావుపేట: ప్రభుత్వ ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో అత్యుత్తమ బోధన అందిస్తున్నామని, తద్వారా అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నామని మండలంలోని దమ్మన్నపేట ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ అన్నారు. పదో తరగతిలో, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. పాఠశాల ప్రారంభం నుంచి పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నామన్నారు. ఇప్పటివరకు పాఠశాల నుంచి 34 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు?

- సర్పంచ్ భర్త నుంచి రూ.1.50 లక్షల వసూలు ?
- నగదు బదిలీకి ఫోన్‌పే, గూగుల్‌పే వినియోగం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో కొన్ని నెలలుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సలీమ్ తన వద్ద నుంచి మొత్తం రూ.1.50 లక్షలు వసూలు చేశారని సర్పంచ్ భర్త బైరి రమేశ్ ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు రమేశ్ తెలిపారు. గ్రామంలో తాను చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించేందుకు కమీషన్ రూపంలో డబ్బులు డిమాండ్ చేశాడని తాను గూగుల్‌పే, ఫోన్‌పేల ద్వారా డబ్బులు పంపినట్లు తన బ్యాంకు స్టేట్మెంట్‌ను విడుదల చేశారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

బిల్లుల కోసమే డబ్బులు



ఇందిరమ్మకాలనీలో నా భార్య బైరి శ్రీవాణి సర్పంచ్‌గా పనిచేసింది. ఆమె హయాంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. వాటి బిల్లుల చెల్లింపుకోసం కార్యదర్శి సలీమ్ డబ్బులు డిమాండ్ చేశాడు. రూ.1.50 లక్షల వరకు అతడికి చెల్లించాను.

– బైరి రమేశ్, ఇందిరమ్మకాలనీ

తప్పుడు ఆరోపణలు సరికాదు



బిల్లుల చెల్లింపు కోసం డబ్బులు డిమాండ్ చేశానని తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు. సర్పంచ్ సూచన మేరకు డీజిల్, లైట్లు కొనుగోలు కోసం గ్రామ పంచాయతీ డబ్బులు, సొంత డబ్బులు ఇచ్చాను. ఆయన వాటిని గూగుల్, ఫోన్‌పే ద్వారా పంపారు. వాటిని తిరిగి జీపీ ఖాతాలో జమచేశా.

– సలీమ్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులోని మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. మండలంలోని దుమాలకు చెందిన న్యాలకంటి సతీశ్ సొంత పనుల నిమిత్తం బైక్‌పై గొల్లపల్లి శివారులోని రాచర్లకాలేజీకి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో బైక్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సతీశ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడి జేబులో ఉన్న ఆధార్ కార్డు సహాయంతో దుమాలకు చెందిన వ్యక్తిగా గుర్తించి సమాచారం అందించారు. ప్రమాద విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ గుళ్లపల్లి నర్సింహారెడ్డి ఆస్పత్రిలో సతీశ్‌ను పరామర్శించారు.

రైతుల ఖాతాల్లో రూ.36.79 కోట్లు జమ

తంగళ్లపల్లి: సిరిసిల్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తయ్యాయని 23 కేంద్రాలకు గాను 20 కేంద్రాల్లో లక్షా 67 వేల 22 క్వింటాళ్ల ధాన్యాన్ని 1482 మంది రైతుల వద్ద సేకరించినట్లు చైర్మన్ బండి దేవదాస్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.36,79,50,787 కోట్లు జమచేశామన్నారు. ధాన్యం కొనుగోలుకు సహకరించిన అధికారులు, రైతులు, హమాలీలకు ధన్యవాదాలు తెలిపారు.

కార్మికుల ప్రయోజనాలే లక్ష్యం



కరపత్రం ఆవిష్కరిస్తున్న రవి, నాయకులు

సిరిసిల్లటౌన్: అన్ని రంగాల కార్మికుల ప్రయోజనాలే లక్ష్యంగా ఏఐటీయూసీ కార్యాచరణతో ముందుకు సాగుతుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏఐటీయూసీ నాల్గో మహాసభల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభ్యున్నతికి సభల్లో తీర్మానాలు చేస్తామని, అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని కోరారు. కడారి రాములు, నల్ల చంద్రమౌళి, అజ్జ వేణు, సోమ నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: పట్టణంలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు జూన్ 8,9,10 తేదీల్లో జరగనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎగమంటి ఎల్లారెడ్డి తెలిపారు. పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో కరపత్రాలు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ ఎప్పుడు ముందుంటుందన్నారు. పార్టీ నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులకు జిల్లాలోని ఎంపిక చేసిన కార్యకర్తలు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు మల్లారపు ప్రశాంత్, నాయకులు ఎలిగేటి రాజశేఖర్, గుర్రం అశోక్, వేణు, శ్రీకాంత్, కుమార్ తదితరులు ఉన్నారు.

బొప్పాపూర్‌లో షూటింగ్ సందడి



సినిమాలోని నటులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో మంగళవారం షార్ట్‌ఫిలిం షూటింగ్ సందడి నెలకొంది. ‘మిషన్ అర్జున్’ షార్ట్‌ఫిలిం సన్నివేశాలను బొప్పాపూర్ శివారు, గ్రామంలోని గడీ, జక్కులచెరువు ప్రాంతాల్లో చిత్రీకరించారు. హీరోహీరోయిన్లు అర్జున్, ఐశ్వర్య, నటులు బొప్పాపూర్ మాజీ సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. షూటింగ్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున గ్రామస్తులు తరలివచ్చారు.

కరాటే అసోసియేషన్ కార్యవర్గం

సిరిసిల్లకల్చరల్: కరాటే అసోసియేషన్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాంగ్రెస్ నాయకుడు చొప్పదండి ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా టమటం రామానుజమ్మ, కార్యదర్శి ఎండీ సమీనా, కోశాధికారి నాగుల కనక య్య, సహాయ కార్యదర్శిగా సమ్మయ్య ఎన్నికయ్యారు.

పూజారి బాధితుల పరేషాన్

వేములవాడ: వేములవాడ పట్టణం మార్కండేయనగర్‌కు చెందిన పూజారి మహేశ్‌కు సన్నిహితంగా ఉండి చేదోడువాదోడుగా పనులు చేసుకుంటున్న వారికి పరేషాన్ మొదలైంది. ఈనెల 8నుంచి పూజారి సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేయండంతో పాటు కనిపించకుండా పోవడంతో ఆయన బాధితులు బెంబేలెత్తిపోతున్నారు. పూజారికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, మధ్యవర్తిత్వాలు చేసినవారికి ఆయాసంస్థల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు సన్నిహితులతో చెప్పుకుంటున్నారు. ఇక పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. మహేశ్ ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిపై కేసు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో మంగళవారం రాత్రి వాహన తనిఖీ చేపట్టారు. మద్యంతాతాగి వాహనాలు నడిపిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వాహనదారులు నిబంధనలను పాటించాలన్నారు.

మస్కట్ జైలునుంచి విముక్తి కల్పించండి

- విప్ ఆది శ్రీనివాస్‌ను కోరిన మరిమడ్ల గ్రామస్తులు



దేవయ్యను విడిపించేలా చొరవ తీసుకోవాలని విప్‌ను కోరుతున్న మరిమడ్ల గ్రామస్తులు

కోనరావుపేట(వేములవాడ): రెండేళ్లుగా మస్కట్ జైలులో మగ్గుతున్న వలసజీవికి విముక్తి కల్పించేలా చొరవ తీసుకోవాలని మరిమడ్లకు చెందిన గ్రామస్తులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. వివరాలు.. కోనరావుపేట మండలం మరిమడ్లకు చెందిన లావణ్యకు వేములవాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన లింగంపెల్లి దేవయ్యతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారులు వరుణ్‌తేజ్, రుత్విక్ ఉన్నారు. లావణ్య కుటుంబం మొత్తం మల్లారం నుంచి వచ్చి మరిమడ్లలోనే నివాసం ఉంటున్నారు. దేవయ్య 2021 సెప్టెంబర్‌లో మస్కట్ వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న ప్రదేశంలో గొడవ జరగడంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా, 2022 మార్చి 14న దేవయ్యను అరెస్ట్ చేసి అమరత్ జైలులో వేశారు. రెండేళ్ల నుంచి జైలుజీవితం అనుభవిస్తున్న దేవయ్యను విడిపించాలని కోరుతూ అతడి భార్య, గ్రామస్తులు జింక శ్రీనివాస్, రాజ మల్లేశం, సింగం నారాయణ, దువ్వ గణేశ్ తదితరులు విప్‌ను కోరారు. ఈసందర్భంగా ఇండియన్ ఎంబసీ ద్వారా వివరాలు తెలుసుకుని దేవయ్య ఇంటికి వచ్చేలా కృషి చేస్తానని విప్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: దుబాయ్ పర్యటన ముగించుకొని వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వేములవాడలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల్‌కార్ శ్రీనివాస్ తెలిపారు. మండల అభివృద్ధి పనులు, ఇటీవల పార్లమెంట్ ఎన్నికలపై చర్చించామని పేర్కొన్నారు. ఈదురుగాలులతో జరిగిన నష్టాన్ని ప్రభుత్వ విప్‌కు వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా వారికి అండగా ఉంటామని తెలిపారన్నారు. ఇక్కడ సిద్ధారెడ్డి, బండారి బాల్‌రెడ్డి, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: దుబాయ్ పర్యటన ముగించుకొని వేములవాడకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మంగళవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మిర్యాల్‌కార్ శ్రీనివాస్, నాయకులు గూడ సిద్దిరెడ్డి, బండారి బాల్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు కలిశారు.

వీర్నపల్లి: ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మండల కాంగ్రెస్ నాయకులు కలి శారు. పలు సమస్యలు, మండల అభివృద్ధిపై చర్చించినట్లు వారు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దినకర్, సంతోష్, పాల్గొన్నారు.

‘నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు’



వేములవాడ రూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో అనూష

ముస్తాబాద్: కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్ అన్నారు. మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం రైతువేదికలో ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవయసాయాధికారి మాట్లాడుతూ స్టాక్, బిల్ బుక్‌లు రోజువారీగా నమోదు చేయాలని రైతులు కొనుగోలు చేసిన విత్తనాలుకు రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువులను ఈ పాస్ మిషన్ ద్వారా మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: ఆయిల్ ఫామ్ పంటలపై ప్రభుత్వం రాయితీ అందిస్తోందని ఏఈవో అనూష అన్నారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, నాగాయపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆధీకృత డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు సంబంధించిన రసీదును భద్రత పర్చుకోవాలన్నారు. సుమన్, సురేశ్, తిరుపతి, మహేశ్, నర్సయ్య, పర్శరాములు, రాజయ్య, చంద్రమౌళి, నరేశ్, దేవయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి చాడ భూంరెడ్డి, ఏఈవో లక్ష్మణ్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్, పదిరరలోని విత్తనాల కొనుగోలుపై రైతులకు, అడవిలో ఉపాధి కూలీలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. వెంకటాపూర్‌లోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. రైతులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లి, గుండన్నపల్లి, రత్నంపేట, మల్లాపూర్, వెంకట్రావుపల్లిలో రైతులకు వానాకాలం సాగులో అవలంబించాల్సిన పద్ధతులపై ఎంఏవో ప్రణీత ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఏవో మాట్లాడుతూ లైసెన్స్ కలిగి ఉన్న విత్తన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. లూజ్‌గా ఉన్న సంచుల్లో విత్తనాలు కొనుగోలు చేయొద్దని, సమావేశంలో ఏఈవోలు శ్రీదేవి, రవళి, సాహితి, అనూష రైతులు ఉన్నారు.

రుద్రంగి: ఫెర్టిలైజర్ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తనాల ధరలు, విక్రయాల వివరాల పట్టిక ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారి దుర్గరాజు అన్నారు. మండలకేంద్రంలోని ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలన్నారు. ఏఈవో, ఫెర్టిలైజర్ షాపుల యజమానులు ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కోనరావుపేట మండలంలోని మామిడిపల్లిలో మంగళవారం మారుపాక చంద్రయ్య, ఊరడి సాయిమల్లయ్య, జవ్వాజి రాజయ్యపై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. ఇదే గ్రామానికి చెందిన లోకుర్తి మల్లయ్య, పండుగ లచ్చయ్య, తీపిరెడ్డి వేణురెడ్డిలకు చెందిన పశువులపై కూడా దాడి చేసింది. గ్రామంలో కొన్ని రోజులుగా కుక్కల బెడద ఎక్కువైందని అధికారులు స్పందించి వాటి బెడద నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899